నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 22 ఏప్రిల్ 2025 | KHAMMAM

ఈసారి అధికారంలోకి రావడం ఖాయం

బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా
మణుగూరు మండల పర్యటనలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21: ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. మరోసారి బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. 420 హామీలను నమ్మి ఓటేసిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచిందని ఆరోపించారు. ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు. ఇప్పుడు ప్రజల మనసుల్లో బీఆర్ఎస్సే ఉందని స్పష్టం చేశారు. భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం మణుగూరుకు వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఘన స్వాగతం పలికారు. అనంతరం మణుగూరులోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జెండాను కవిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27న రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు, పార్టీకి మధ్య బలమైన అనుబంధం ఉండాలని సూచించారు. అనంతరం ఉద్యమకారుడు పవన్‌నాయక్ ప్రతాప్ ఏర్పాటుచేసిన తేనీటి విందును స్వీకరించారు. తరువాత మణుగూరులోని ఎక్సలెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసుఫ్ నివాసంలో పార్టీ నేతలతో కలిసి భోజనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణుగూరులోని బీఆర్ఎస్ కార్యాలయంలో గులాబీ జెండా ఎగురవేసి జై తెలంగాణ నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

భద్రాద్రిలో ఉపే ఎన్నిక వస్తే..
ఎగిరేది గులాబీ జెండానే..

బీఆర్ఎస్ ఉద్యమకారులు, పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, పక్కన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ,బానోతు చంద్రావతి, సీనియర్ నేత దిండిగాల రాజేందర్

భద్రాచలం, ఏప్రిల్ 21 : భద్రాద్రిలో ఉప ఎన్నిక వస్తే ఎగిరేది గులాబీ జెండాయేనని ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోకెల్లా భద్రాచలం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా తెల్లం వెంకట్రావును ఇక్కడి ప్రజలు గెలిపిస్తే.. అతడు కాంగ్రెస్‌లో చేరి ద్రోహిగా మారారని విమర్శించారు. భద్రాద్రి జిల్లాలో సోమవారం పర్యటించిన ఆమె.. తొలుత భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఇక్కడి హరిత టూరిజం హోటల్‌లో భద్రాచలం నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతోనూ, జిల్లాలోని ఉద్యమకారులతోనూ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ శ్రేణులు, ఉద్యమకారులు కలిసి ప్రజల వెంటే ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషిచేస్తూ భవిష్యత్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌ను గెలిపించేలా అండగా నిలవాలని కోరారు. తెలంగాణను కాంగ్రెస్ సర్కారు ఇప్పటికే ఆగం చేస్తోందని అన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ఏమరుపాటుగా ఉంటే మరింత ఆగం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. మోసపోతే గోస మిగులుతుందంటూ గతంలో కేసీఆర్ పదేపదే చెప్పారని గుర్తు చేశారు. మోసం చేయడమనేది కాంగ్రెస్ నైజమని స్పష్టం చేశారు.

వారథిగా ఉంటా..

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, పార్టీ శ్రేణులకు, ఉద్యమకారులకు మధ్య తాను వారథిగా ఉంటానని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. కార్యకర్తలు, ఉద్యమకారుల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని అన్నారు. కార్యకర్తలు, ఉద్యమకారులను కాపాడుకోవడాన్ని తన బాధ్యతగా భావిస్తానని అన్నారు. అలాగే, తెలంగాణను కాపాడుకోవడం కూడా బీఆర్ఎస్ శ్రేణుల ప్రథమ కర్తవ్యమని అన్నారు. బీఆర్ఎస్ పాలనా సారథ్యంలోని పదేళ్లలో రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడంతో కొందరికి న్యాయం జరగకపోయినా వారంతా కేసీఆర్ వెంటే నడుస్తూ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచారని గుర్తుచేశారు. ఇకపై వారి శ్రమ వృథాగా పోదని స్పష్టం చేశారు.

‘ఆత్మీయ భరోసా’ ఇవ్వకుండా మోసం..

రైతులకు, రైతు కూలీలకు ఆత్మీయ భరోసా ఇవ్వకుండా కాంగ్రెస్ సర్కారు మోసం చేసిందని కవిత విమర్శించారు. కళ్లెదుటే తెలంగాణ ఆగమవుతుంటే ప్రజలతోపాటు పార్టీ కార్యకర్తలు, ఉద్యమకారులు చూస్తూ ఊరుకోవద్దని కోరారు. అప్పులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విపరీతమైన అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. లెక్కలు అడిగితే చెప్పబోమనడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొమ్ము కాబట్టి ప్రజలకు మంచి చేసినా, చెడు చేసినా ఆ లెక్కలను ప్రభుత్వం చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆసుపత్రులు, హాస్టళ్లు సహా అన్ని వ్యవస్థలూ నిధుల్లేక నీరసించిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసరా పింఛన్లను పెంచనే లేదని, తమ బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2,016 పింఛన్లనే ఇప్పటికీ ఇస్తున్నారని అన్నారు. పింఛన్‌దారుల ఉసురు తప్పక తగులుతుందని స్పష్టం చేశారు. అలాగే, కాంగ్రెస్ వస్తే కరువొచ్చినట్లేనని మరోసారి రుజువైందని, దీనిని ప్రజలు కూడా గమనిస్తున్నారని అన్నారు.

రూ.1.60 లక్షల కోట్ల అప్పు తెచ్చి ఏం చేశారు?

రూ.1.60 లక్షల కోట్లకు పైగా అప్పు తెచ్చి ఏం చేశారని ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం బుకాయిస్తోందని, చెప్పబోమంటోందని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. రూ.40 వేల కోట్ల విలువైన భూములను రూ.10 వేల కోట్లకు తాకట్టు పెట్టిందని విమర్శించారు. అయితే ఆ రూ.10 వేల కోట్లతో రైతుభరోసా ఇచ్చామని, రుణ మాఫీ చేశామని మంత్రులు చెబుతుండడం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులున్నా మూడు పైసలు కూడా తేలేదని ఎద్దేవా చేశారు. కానీ.. కేసీఆర్ మాత్రం ఆనాడు ఖమ్మం ఉమ్మడి జిల్లాకు సీతారామ ప్రాజెక్టును తెచ్చి లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందేలా చేశారని గుర్తుచేశారు. 1969లో ఖమ్మం జిల్లాలోనే తెలంగాణ ఉద్యమం మొదలైందని జ్ఞప్తికి తెచ్చారు. తెలంగాణను కాపాడుకోవాలంటే గులాబీ కండువానే శ్రీరామరక్ష కావాలని స్పష్టం చేశారు. అది కార్యకర్తలు, ఉద్యమకారుల చేతుల్లోనే ఉందని గుర్తుచేశారు.

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు బానోతు హరిప్రియ, వనమా వెంకటేశ్వరరావు, బానోతు చంద్రావతి, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, దేవీలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాపైనే కేసీఆర్ ప్రత్యేక దృష్టి: రేగా

ఉమ్మడి ఖమ్మం జిల్లాపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, బీఆర్ఎస్ పాలనలోని పదేళ్లలోనూ ఈ జిల్లాకు ఎక్కువ నిధులిచ్చి అభివృద్ధికి పాటుపడ్డారని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు గుర్తుచేశారు. ఈ ప్రాంత బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు సీతారామ ప్రాజెక్టును నిర్మించిన అపర భగీరథుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, మళ్లీ కేసీఆరే రావాలంటూ బలంగా కోరుకుంటున్నారని అన్నారు.

కేసీఆర్ బాటలోనే ఉద్యమకారులు: దిండిగాల

బీఆర్ఎస్ అధినేత, ఉద్యమసారథి కేసీఆర్ బాటలోనే ఉద్యమకారులు కూడా నడుస్తున్నారని, ఆయన మాటే ఉద్యమకారులకు వేదవాక్కని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఉద్యమకారుడు దిండిగాల రాజేందర్ అన్నారు. పదేళ్ల కాలంలో ఉద్యమకారులకు ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమకారుల సమస్యలను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూడాలని కవితకు విన్నవించారు.

- కేసీఆర్, పార్టీ శ్రేణులు, ఉద్యమకారులకు మధ్య వారథిగా ఉంటా..
- నిరుపేదలకు ‘ఆత్మీయ భరోసా’ అందకుండా కాంగ్రెస్ మోసం చేసింది
- కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ కళ్లెదుటే ఆగమవుతుంటే ఊరుకోవద్దు
- రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే గులాబీ కండువానే శ్రీరామరక్ష కావాలి
- బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉద్యమకారుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత
- భద్రాచలంలో పర్యటన.. సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న కవిత

తొలుత భద్రాచలం చేరుకున్న కవిత.. ఉదయం శ్రీసీతారామచంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు దేవస్థాన అర్చకులు ఆలయ సంప్రదాయాలతో స్వాగతం పలికారు. తొలుత ధ్వజస్తంభం వద్ద, తరువాత గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలను కూడా కవిత దర్శించుకున్నారు.

వనమా గారూ.. ఎలా ఉన్నారు..

కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యేను ఆప్యాయంగా పలుకరించిన కవిత

పాల్వంచ, ఏప్రిల్ 21: ‘వనమా గారూ.. ఎలా ఉన్నారు..’ అంటూ కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఎమ్మెల్సీ కవిత ఆప్యాయంగా పలుకరించారు. జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం భద్రాచలం వచ్చిన ఆమెకు పార్టీ శ్రేణులతో కలిసి వనమా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భద్రాద్రి రామయ్య ప్రతిమను అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం వనమా రాఘవేందర్‌రావు ఆధ్వర్యంలో పాల్వంచ నుంచి 50 కార్లలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలు భద్రాచలం వెళ్లి ఆమెను కలిశారు.

ఎమ్మెల్సీ కవితకు భద్రాద్రి రాముడి ప్రతిమను అందిస్తున్న వనమా వెంకటేశ్వరరావు, చిత్రంలో ఎంపీ వద్దిరాజు

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో..
సౌకర్యాలు నిల్

ఖమ్మం జిల్లాలో ధాన్యం పండించిన రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ఆరుగాలం శ్రమించి పంటను తీసుకొచ్చిన అన్నదాతలు.. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అరిగోస పడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సదరు సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటుచేయని కారణంగా అకాల వర్షాల సమయంలో ధాన్యం నీళ్ల పాలవుతోంది. దీంతో రెక్కలు ముక్కలు చేసుకొని పంటను పండించిన రైతులు తీవ్రనష్టాన్ని చవిచూస్తున్నారు. హడావిడిగా కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం.. కొనుగోలు కేంద్రాల్లో వసతుల కల్పనను మాత్రం మర్చిపోయింది. దీంతో పంటను కోల్పోతున్న రైతులు సర్కారుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే సమయంలో అరగంట సేపు ఉండే ప్రజాప్రతినిధులు, అధికారుల కోసం టెంటు, చల్లని నీరు, కుర్చీల వంటి వసతులు ఆగమేఘాల మీద ఏర్పాటుచేసే నిర్వాహకులు.. రైతులకు సౌకర్యాలు కల్పించే విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించే పరికరాలు, ధాన్యంపై కప్పే టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు వంటివి సరిపడినన్ని సమకూర్చిన పాపానపోలేదు. చివరికి రైతులకు, కూలీలకు, హమాలీలను నిలువ నీడ కూడా ఏర్పాటుచేయలేదు. కనీసం తాగునీళ్లు కూడా అందుబాటులో ఉంచకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు.

-ఖమ్మం, ఏప్రిల్ 21

తడుస్తున్న ధాన్యం.. పట్టించుకోని యంత్రాంగం
పంటను తెచ్చిన రైతులకు తప్పని తిప్పలు..
అకాల వర్షాలకు పలు మండలాల్లో ముద్దయిన ధాన్యం
తడిసిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు కరువు
దీంతో రైతుల నుంచి సేకరణకు నిర్వాహకుల నిరాకరణ
తడిసిన వడ్లను కొనక, సర్కారు స్పందించక అన్నదాతల గగ్గోలు

తడిసిన ధాన్యం రాసి నుంచి బకెట్‌తో నీటిని తీసి వేస్తున్న రైతు (ఫైల్)

ఖమ్మం జిల్లాలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ద్వారా ఆదాయం పొందుతున్న ప్రభుత్వం.. అదే రైతులకు సదుపాయాలు కల్పించడంలో మాత్రం బాధ్యతా రహితంగా వ్యవహరిస్తోంది. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతుండడంతో ధాన్యం ఆరబోసిన తర్వాత రైతులు కూర్చోవడానికి కనీసం నీడ వసతి కూడా కల్పించలేదు. తాగునీటి సౌకర్యం కూడా కల్పించకపోవడంతో బయట దుకాణాల వద్ద నీళ్ల బాటిళ్లు కొనుగోలు చేసి దాహం తీర్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

తరుగు పేరిట 5 నుంచి 10 కేజీల కోత..

సన్నరకం ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం చెల్లించే రూ.500 బోనస్‌ను కాజేసేందుకు దళారులు అనేక ఎత్తులు వేస్తున్నారు. కొందరు వ్యాపారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కుమ్మక్కవుతున్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని క్వింటాకు రూ.100 నుంచి రూ.150 వరకు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఇందులో తరుగు పేరిట 5 నుంచి 10 కేజీల వరకూ కోత విధిస్తున్నారు. అదే ధాన్యాన్ని బినామీల పేరుతో కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి బోనస్‌ను కాజేస్తున్నారు. గత వానకాలం సీజన్‌లో కూడా ఇదే విధంగా కొందరు దళారులు అక్రమంగా బోనస్‌ను పొందినట్లు సమాచారం. సన్న రకం బియ్యం ధరలు పెరుగుతుండడంతో ఇప్పటికే కొందరు దళారులు రైతుల నుంచి పచ్చి ధాన్యాన్ని క్వింటా రూ.2 వేల వరకూ వెచ్చించి కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు (ఫైల్)

లక్ష్యం కొండంత.. కొన్నది గోరంత..

ఖమ్మం జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించింది. కానీ ఈ నెల 15న నాటికి 211 కొనుగోలు కేంద్రాలను మాత్రమే ప్రారంభించారు. సోమవారం నాటికి పూర్తిగా ప్రారంభించారు. ఇప్పటి వరకు కేవలం సన్నరకం ధాన్యం13,993 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం ధాన్యం 4,450 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. కాగా, ఈ యాసంగి సీజన్‌లో 1.89 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలు, 70 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకాల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది.

తడుస్తున్న ధాన్యం..

జిల్లాలో గడిచిన వారం రోజులుగా అక్కడక్కడా కురుస్తున్న అకాల వర్షం వల్ల కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబోసిన ధాన్యం తడిసిపోతోంది. ఆరబెట్టిన ధాన్యం తడవకుండా ప్రభుత్వం టార్పాలిన్లను అందుబాటులో ఉంచకపోవడంతో ధాన్యం తడిసి ముద్దవుతోంది. చేతికొచ్చిన ధాన్యం విక్రయించే సమయంలో నీళ్లపాలు కావడంతో రైతులు కన్నీటిపర్యంతమవుతున్నారు. తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి, ముదిగొండ తదితర మండలాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ఇటీవలి వర్షాలకు ధాన్యం తడిచిముద్దయిన విషయం విదితమే. ముదిగొండ మండలం గోకినపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదంటూ చివరికి అన్నదాతలు రహదారిపై ఆందోళన చేయాల్సి వచ్చింది.

తడిచిన ధాన్యం కొనుగోలుపై ఆదేశాలు కరువు..

అయితే, ఇటీవలి అకాల వర్షాలకు జిల్లాలో తడిచిన ధాన్యాన్ని రైతుల కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం నుంచి అధికారులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఇప్పటివరకూ ఆదేశాలు అందలేదు. దీంతో తడిసిన ధాన్యాన్ని కొనేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిరాకరిస్తున్నారు. ఇటు తడిసిన వడ్లను నిర్వాహకులు కొనకపోవడంతో, సర్కారు స్పందించకపోవడంతో అన్నదాతలు గగ్గోలు పెడుతున్నారు.

ర్యాలీగా.. ఇంటింటికీ తిరుగుతూ..

రజతోత్సవ సభపై మడుపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు ప్రచారం

మధిర, ఏప్రిల్ 21 : ఈ నెల 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, అభిమానులు లక్షలాదిగా తరలిరావాలని కోరుతూ మడుపల్లి గ్రామంలో జడ్పీ మాజీ చైర్మన్, మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తొలుత బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ సభ ఆవశ్యకతను వివరిస్తూ బీఆర్ఎస్ సభకు తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా కమల్‌రాజు మాట్లాడుతూ గత కేసీఆర్ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలను ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పూర్తిస్థాయిలో ఆదుకున్నదని గుర్తుచేశారు. ఎన్నో హామీలతో ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పాలన సాగిస్తున్నదని, ఇలాంటి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రజతోత్సవ సభకు జాతర మాదిరిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అరిగె శ్రీనివాసరావు, యన్నంశెట్టి అప్పారావు, పుచ్చకాయల వెంకటనారాయణ, ఐలూరి ఉమామహేశ్వరరెడ్డి, నీలం హనుమయ్య, పంబి సత్యనారాయణ, వేల్పుల శ్రీనివాసరావు, పగడాల వీరభద్రం, ఆళ్ల నాగబాబు, పరిస శ్రీనివాసరావు, చీదిరాల రాంబాబు, లంకెమల్ల నాగేశ్వరరావు, చీమల పుల్లయ్య, ఏసుపోగు దేవ, కొండ పాల్గొన్నారు.

మడుపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఏసీబీకి చిక్కిన సీఐ

- రూ.లక్ష లంచం తీసుకుంటూ పట్టుబడిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్
- భద్రాద్రి జిల్లా మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో ఘటన

మణుగూరు టౌన్, ఏప్రిల్ 21 : భూ వ్యవహారం కేసులో బాధితుల పేర్లు చేర్చకుండా చేసేందుకు రూ.లక్ష డిమాండ్ చేసి లంచం తీసుకుంటుండగా సీఐతోపాటు ఓ టీవీ రిపోర్టర్‌ను ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఈ ఘటన మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరులోని ప్రభుత్వ భూమిలో అక్రమ వెంచర్లు చేసి క్రయవిక్రయాలు జరిపిన విషయంలో రెవెన్యూ అధికారులు పూర్తి విచారణ చేసి.. అందుకు బాధ్యులైన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ భూమిని కొనుగోలు చేసి ప్రస్తుతం అందులోనే నివాసం ఉంటున్న వారిపై కేసు కూడా నమోదైంది. అయితే ఆ భూమిని విక్రయించిన వారిపై కేసు నమోదు కాలేదు. దీనిని ఆసరా చేసుకున్న సీఐ సోమ సతీశ్‌కుమార్ సదరు భూమిని విక్రయించిన వారిని బ్లాక్‌మెయిల్ చేశారు. కేసు నంబర్ 150/2025, సెక్షన్లు 318(4), 329(3) బీఎన్ఎస్, తెలంగాణ స్టేట్ గేమింగ్(సవరణ) చట్టం సెక్షన్ 5 కింద నమోదైన కేసుకు సంబంధించి బేరసారాలు చేశారు. ఈ కేసులో బాధితుల పేర్లు చేర్చకుండా చేసేయత్నంలో భాగంగా రూ.4 లక్షలు డిమాండ్ చేయగా.. ఈ వ్యవహారంలో బిగ్ టీవీ రిపోర్టర్ మిట్టపల్లి గోపి మధ్యవర్తిగా వ్యవహరించారు. ‘మీరు రూ.4 లక్షలు ఇవ్వకపోతే మీపై కూడా కేసు నమోదు చేస్తాం’ అని బెదిరించారు. అయితే తాను ఒకరికి రూ.3 లక్షలు బాకీ ఉన్నానని, ఇందులో రూ.3 లక్షలు వారికి చెల్లించి, మిగిలిన రూ.లక్ష తనకు ఇవ్వాలని సీఐ చెప్పారు. ఇందుకు అంగీకరించిన బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయించి సీఐ లంచం వ్యవహారం విషయాన్ని వివరించారు. వారు పన్నిన పథకం ప్రకారం.. రూ.లక్ష లంచం ఇచ్చేందుకు బాధితులు సోమవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడంతో ఆ సమయంలో మరో పనిపై సీఐ బయటకు వెళ్లారు. మధ్యవర్తి గోపి ఆ నగదును తనకు ఇవ్వాలని చెప్పి తీసుకున్న తర్వాత ఏసీబీ అధికారుల సమక్షంలోనే ఈ విషయాన్ని ఫోన్ ద్వారా సీఐకి కూడా చెప్పాడు. ఇదంతా రికార్డు చేసిన ఏసీబీ అధికారులు సీఐని, రిపోర్టర్ గోపిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పూర్తి ఆధారాలతో వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మణుగూరులో ఏసీబీ అధికారులకు పట్టుబడిన సీఐ సతీశ్‌కుమార్, రిపోర్టర్ గోపి